క్లుప్తంగా

‘విద్యార్థుల్లో జాతీయభావం పెంపొందించాలి’



చిత్రలేఖనం ప్రదర్శనలో ప్రతాప రామకృష్ణ

వేములవాడ: విద్యార్థుల్లో జాతీయతాభావం పెంపొందించేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అధ్యాపకులను కోరారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయవాదం చిత్రలేఖనంలో చిన్నారులు గీసిన చిత్రాలను ఆయన మంగళవారం చూపించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. పాఠశాల కరస్పాండెండ్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన దివ్యాంగ సమితి నాయకులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: సిరిసిల్ల జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మంగళవారం జిల్లా దివ్యాంగ సమితి అధ్యక్షుడు దొంతినేని చంద్రారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రారావు మాట్లాడుతూ దివ్యాంగుల రక్షణ కొరకు ఏర్పాటు చేసిన 92 సెక్షన్ 2016 చట్టాన్ని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో అమలు చేయాలని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగ నాయకులు నీరటి రాజు, మాట్ల కుమార్, మల్లేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

‘మా భూమి మాకిప్పించండి’



పంచాయతీ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులు

కోనరావుపేట: అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తి నుంచి మా భూమిని మాకు ఇప్పించాలని ఓ కుటుంబం రోడ్డుపై బైఠాయించింది. మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన నాగసముద్రం మల్లేశం అదే గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి శివయ్య తమ భూములను 45 ఏళ్ల క్రితం రద్దుబదలు చేసుకుని సాగు చేసుకుంటున్నారు. కానీ కబ్జాలో ఉన్నవారికి పట్టాలు మారలేదు. దీంతో శివయ్య వారసులైన నాగయ్య అన్యాయంగా తమ భూమిని పట్టా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మోఖా మీద విచారణ జరిపినా తమ భూమి తమకు ఇప్పించడంలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమాకాంత్ అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న జంక్షన్లు

- ప్రాణాలు హరిస్తున్న మూలమలుపులు
- ప్రధాన రహదారుల్లో పెరుగుతున్న ప్రమాదాలు



తెర్లుమద్ది జంక్షన్ వద్ద ప్రమాదకరంగా వస్తున్న వాహనాలు



హెచ్చరిక బోర్డు లేని మూలమలుపు

ముస్తాబాద్: ప్రధాన రహదారులు నెత్తురోడుతున్నాయి. ప్రధాన రహదారులపై ఉన్న జంక్షన్లు, మూల మలుపులతో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలుస్తుండగా అనేక మంది క్షతగాత్రులవుతున్నారు. ముస్తాబాద్ మండలంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల్లో ఉన్న మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ముస్తాబాద్ పట్టణం రోజురోజుకు విస్తరించడం, అదేరీతిలో రహదారులు అభివృద్ధి చెందడం, వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే దీనికి తగినట్లుగా మలుపుల వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టలేదు.

తెర్లుమద్ది క్రాసింగ్ వద్ద పోతున్న ప్రాణాలు

- ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై ముస్తాబాద్ శివారులో తెర్లుమద్ది జంక్షన్ ఉంది. ముస్తాబాద్ నుంచి సిద్దిపేట రహదారిని ఆధునీకరించారు. అలాగే ముస్తాబాద్ నుంచి జిల్లెల్లకు వెళ్లే దారిని డబుల్ రోడ్డుగా మార్చారు. ఈ రెండు రహదారులు కలిసే వై జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. సిద్దిపేట నుంచి వచ్చే భారీ వాహనాలు, కార్లు అత్యంత వేగంగా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అయితే వై జంక్షన్‌కు ముందు ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. అలాగే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో సిద్దిపేట నుంచి వచ్చేవారు నేరుగా వెళ్లి బస్టాప్‌ను ఢీకొడుతున్నారు. నాలుగేళ్లలో పలువురు మృతి చెందారు. ఇక ముస్తాబాద్ నుంచి జిల్లెల్ల, తెర్లుమద్దికి వెళ్లే వారు సిద్దిపేట నుంచి వచ్చే వాహనాలను గమనించకుండా వెళ్తుండడంతో ప్రమాదానికి గురవుతున్నాయి. ఇక్కడ ఐలాండ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు కాకుండా నియంత్రించవచ్చని మండల వాసులు మంత్రి కేటీఆర్‌కు కోరుతున్నారు.

ప్రధాన మలుపులు ఇవే..

- ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే రహదారిలో పట్టణ శివారులోనే మలుపులు ఉండగా అక్కడ ఇప్పటికీ ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మద్దికుంట శివారులో మలుపులు ఉన్నాయి.
- ముస్తాబాద్ నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారిలో నామాపూర్ ఎక్స్‌రోడ్డులో ప్రతి వారం రోజులకొకసారి ప్రమాదం జరుగుతోంది. వారం క్రితం జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొని ఒకరు ప్రాణాలు కొల్పోగా, ఇద్దరు గాయపడ్డారు.
- పక్షం రోజుల క్రితం నామాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి సిరిసిల్ల వెళ్లే దారిలో మానేరు కెనాల్ వద్ద ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తి ఇప్పటికీ కోమాలో చావుబతుకుల మధ్య ఉన్నాడు.
- ముస్తాబాద్ నుంచి కామారెడ్డి వెళ్లే దారిలో చిప్పలపల్లి శివారులో మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం, లారీ ఢీకొట్టగా ముస్తాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలుకోల్పోయారు.
- గూడెం గ్రామంలో రెండు చోట్ల ప్రమాకరంగా మలుపులు ఉండగా, నెలరోజుల క్రితం ఆవునూర్ వ్యక్తి మలుపు వద్ద అదుపుతప్పి పొలంలో పడి మృత్యువాత పడ్డాడు.
- ఆవునూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. గూడెం నుంచి రాంరెడ్డిపల్లె వెళ్లే వై రోడ్డు వద్ద ఇదే పరిస్థితి ఉంది.

రోడ్లు విస్తరించాలి



ప్రధాన రహదారులు విస్తరించినట్లుగానే, జంక్షన్ల వద్ద రహదారులను విస్తరించాలి. చిన్నపాటి నిర్లక్ష్యంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయి, కుటుంబాలను దిక్కులేని వారిని చేస్తున్నారు. ప్రమాద హెచ్చరికలు పెట్టాలి. రోడ్ల అభివృద్ధితోపాటు ఎక్స్‌రోడ్ల వద్ద అదేరీతిలో అభివృద్ధి చేయాలి. ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– కోల కృష్ణ, పోతుగల్

ఐలాండ్ ఏర్పాటు చేయాలి



ముస్తాబాద్, తెర్లుమద్ది, సిద్దిపేట రహదారుల జంక్షన్ వద్ద ఐల్యాండ్ ఏర్పాటు చేయాలి. ఇక్కడ చాలామంది ప్రాణాలు వదిలారు. రోడ్డు నిబంధనలు పాటించేలా ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలి. హైమస్ట్ లైట్లను పెట్టాలి. జంక్షన్‌ను విస్తరించాలి. ప్రమాదాలు నివారించాలి. విలువైన ప్రాణాలను రక్షించాలి.

– కిషన్‌రావు, సర్పంచ్

ప్రతిపాదనలు పంపించాం



ముస్తాబాద్, తెర్లుమద్ది జంక్షన్ వద్ద ఐలాండ్ నిర్మాణానికి రూ.2 కోట్ల ప్రతిపాదనలు చేశాం. నిధులు ఇంకా రాలేదు. త్వరలోనే ప్రధాన మలుపుల వద్ద రోడ్డుపై డ్రమ్ముల్‌చిక్స్ ఏర్పాటు చేస్తాం. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. మలుపుల వద్ద చెట్ల పొదలను తొలగిస్తాం.

– నరేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

సమస్యలపై గళమెత్తిన సభ్యులు

- గంభీరావుపేట మండల సమావేశం



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ

గంభీరావుపేట: మండలంలో నెలకొన్న సమస్యలపై సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీపీ వంగ కరుణ అధ్యక్షతన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు.

➡ ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు.

➡ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ప్రజలకు సకాలంలో సరైన వైద్యం అందడం లేదని ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

➡ ఉపాధిహామీ పథకంలో నాటిన మొక్కలను సంరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారని సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

➡ వ్యవసాయానికి విద్యుత్ సమయానుకూలంగా రావడం లేదని మండిపడ్డారు.

➡ గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ ఎంపీపీ లత, సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నడిరోడ్డుపై గుంత

వేములవాడ: స్థానిక మహాలక్ష్మి ఆలయం సమీపంలో నడిరోడ్డుపై గుంత పడింది. కౌన్సిలర్, అధికారులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. వాహనదారులు, పాదచారులు దీంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గుంత పూడ్చివేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: అన్వేశ్, మున్సిపల్ కమిషనర్
ఫోన్ నంబర్: 80085 78959

పవర్ కట్

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ టౌన్–1 ఏఈ స్రవంతి ప్రకటించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెద్దబోనాల, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, జేపీనగర్, పద్మనగర్, అంబికానగర్, అశోక్‌నగర్, వెంకంపేట, సుందరయ్యనగర్, ప్రగతినగర్, శివనగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఏబీవీపీ నాయకులపై దాడి అమానుషం

ఇల్లంతకుంట: కరీంనగర్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు శాంతియుతంగా నిరసన చేస్తే పోలీసులు లాఠీచార్జి చేయడంతో పాటు, విద్యార్థి నాయకులను ఇల్లంతకుంట జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు కాలుతో తన్నడం అమానుషమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నాగసముద్రాల సంతోష్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో విద్యార్థులు పడుతున్న కష్టాలు చూడలేక ఏబీవీపీ అనేక పోరాటాలు చేస్తుంటే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, పోలీసులు దౌర్జన్యం చేయడం హేయమని పేర్కొన్నారు.

సర్వీస్ ఆధారంగా బదిలీ చేపట్టాలి

ఇల్లంతకుంట: రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న బదిలీలు, ప్రమోషన్లలో పీఎస్ హెచ్‌ఎం, పండిట్, పీఈటీలను అప్‌గ్రేడేషన్ ఇచ్చి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాన్వాడ శంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 20 నుంచి 22 ఏళ్లుగా ప్రమోషన్ లేక ఒకే సర్వీస్‌లో పనిచేస్తూ ఉపాధ్యాయులు నిరాశకు గురవుతున్నారన్నారు. ప్రస్తుత బదిలీలలో రెండేళ్ల సర్వీస్ నిబంధనను సడలించాలని, జీరో సర్వీస్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని, ప్రమోషన్లు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

‘సఖి’ సేవలపై అవగాహన

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రం సేవల గురించి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలపై వేధింపులను నిరోధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, టోల్ ఫ్రీ నంబర్, అక్రమ రవాణా, అత్యాచారాలు, యాసిడ్ దాడుల నుంచి రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ రోజా, సోషల్ కౌన్సిలర్ కళావతి, పారా మెడికల్ అధికారి ప్రవళిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై..

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులకు శిక్షణ, అవగాహన సదస్సులో సామాజిక కార్యకర్త అర్చన మాట్లాడారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాలు, పిల్లలపై అత్యాచారాలు, అక్రమ దత్తత అడ్డుకోవాలని, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ శివజ్యోతి, ఉపసర్పంచ్ రాములు, ఎంపీటీసీ స్వప్న, వీపీవో సాంబశివరావు, ఆర్‌ఐ మధు, కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

వేసవికి బల్దియా ముందస్తు చర్యలు



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు

- తాగునీటి సరఫరాకు రూ. 18.80 లక్షలు
- జంక్షన్ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- సాధారణ సమావేశంలో 14 అంశాలు ఆమోదం

సిరిసిల్లటౌన్: రాబోవు ఎండాకాలంలో పట్టణ ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిరిసిల్ల బల్దియా ముందస్తు చర్యలను చేపట్టింది. అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు వీలుగా రూ.18.80 లక్షలు కేటాయించినట్లు చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో మంగళవారం కౌన్సిల్ హాలులో నిర్వహించగా ఎజెండాలో 16 అంశాలను ప్రవేశపెట్టగా 14 అంశాలను కౌన్సిల్ తీర్మానించింది. పట్టణంలో మున్సిపల్ నర్సరీలను ఒక ఏడాది నిర్వహణకై రూ.13.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. శాంతినగర్‌లోని కొత్తగా నిర్మించే 60 ఫీట్ల రోడ్డు జంక్షన్ అభివృద్ధికి పరిపాలనపరమైన అనుమతులకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీమా పత్రాల పంపిణీ

మున్సిపల్ కార్మికుల కోసం టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు సొంత ఖర్చులతో చేయించిన పోస్టాఫీస్ ఖాతాలు, ప్రమాద బీమా పత్రాలు, రక్షిత సామగ్రి పంపిణీ చేశారు. అలాగే శ్రీవిశ్వనాథస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీపీవో అన్సార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

‘చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి’

సిరిసిల్లటౌన్: బస్సు ప్రమాదంలో గాయపడిన చిన్నారి విద్యార్థులకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందిచాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలో నిర్వహించిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కాలం చెల్లిన బస్సులు నడపడం మూలంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై అధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఇల్లందుల ప్రకాశ్, మట్ట నరేశ్, రుద్రవేని సుజిత్‌కుమార్, గణేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి’



కళ్లద్దాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వేములవాడ: ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్ కొండ పావనితో కలిసి పరిశీలించారు. కంటి పరీక్షలు పూర్తిచేసుకున్న అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. మనిషికి కంటి చూపు ఎంతో ముఖ్యమైందని దృష్టిలోపంతో ఎంతోమంది నిరుపేదలు బాధపడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తూ వారికి అండగా నిలబడిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొబ్బల మంజుల, ఎంపీటీసీ మీసాల కళ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పనుల్లో అలసత్వం వద్దు

తంగళ్లపల్లి: ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే మెమోలు జారీ చేస్తానని ఎంపీడీవో లచ్చాలు హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏపీవో నాగరాజు, జేఈ రాజనర్సు, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థిని

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అల్లె శ్రిత తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఉపాన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: ముస్తాబాద్, గూడెం, రామలక్ష్మణపల్లె, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల్లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సర్పంచ్ బైరి శ్రీవాణి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

గోరుముద్దకు చేయూత

కోనరావుపేట: మండలంలోని సుద్దాల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గోరుముద్ద కార్యక్రమాన్ని సర్పంచ్ దేవలక్ష్మి, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు మంగళవారం ప్రారంభించారు.

నర్సరీ పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధిహామీ ద్వారా ఏర్పాటు చేసిన హరిత నర్సరీని ఏపీవో చంద్రయ్య సోమవారం పరిశీలించారు.

యువకుడి రక్తదానం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాకకు చెందిన నల్ల సతీశ్‌కుమార్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఒకరికి రక్తదానం చేశాడు.

పౌరహక్కుల దినం

కోనరావుపేట: మండలం ధర్మారంలో మంగళవారం పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. డీటీ సత్యనారాయణ, సర్పంచ్ గున్నాల అరుణ, ఆర్‌ఐ రజిని, ఎంపీడీవో రామకృష్ణ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: వంద మంది పేదలకు మంగళవారం అన్నదానం చేసినట్లు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు.కోనరావుపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు నెరవేరలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ మండల వాస్తవ్యులు అయినా పట్టించుకోవడంలేదన్నారు. నాయకుల దీక్షకు కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మద్దతు ప్రకటించారు. రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్ సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. జిల్లా నాయకులు మల్లికార్జున్, బాలాజీ, పల్లం అన్నపూర్ణ పాల్గొన్నారు.